వేతన వెతలు..!

- సకాలంలో అందని ఉపాధి బిల్లులు
- నిధులు విడుదల కాలేదంటున్న అధికారులు
- ఇబ్బందుల్లో కూలీలు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గుడిబండ: గ్రామాల్లో వలసల నివారణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. దీంతో కూలీల ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వందలాది మంది పనులు చేస్తున్నా, వేతనాలు చెల్లించడంలో మాత్రం తీవ్ర జాప్యం ఏర్పడుతుంది. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. ఏదో ఉపాధి పనులు ఆదుకుంటాయి కదా అని ఉపాధి కూలీ పనులకు వెళ్తే నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోతే ఎలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

భారీగా బకాయిలు..

ప్రతి కూలీకి గరిష్ఠంగా రోజుకు రూ.300 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి జిల్లా అధికారులు సూచనలు చేస్తున్నారు. అయితే మడకశిర నియోజకవర్గంలో మాత్రం సరాసరిన రూ.150 నుంచి రూ.260 వరకు మాత్రమే వేతనం వస్తోంది. ఈ లెక్కన దాదాపు ఒక్కొక్కరికి రూ.11 వేలకు పైగా బకాయిలు ఉన్నాయి. ఒక ఇంట్లో ఇద్దరేసి వ్యక్తులు పనికి వెళ్తే ఒక్కో కుటుంబానికి రూ.22 వేలకు పైబడి ఉపాధి వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకుని బకాయిలు వెంటనే ఖాతాలకు జమ చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

మడకశిర నియోజకవర్గంలో ఇలా..

మండలం	జాబ్‌కార్డులు	కూలీల సంఖ్య
మడకశిర	10,054	12,880
గుడిబండ	9,952	14,132
అమరాపురం	8,627	10,235
అగళి	6,872	9,769
రొళ్ల	6,058	8,430

అధికారులు స్పందించాలి



రోజులు తరబడి పనికి వెళుతున్నా. ఇంత వరకూ వేతనాలు అందలేదు. 15 రోజులకు ఒకసారి ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఇప్పటికే 70 రోజులు అవుతున్నా జమ చేయడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే అధికారులు స్పందించి వేతనాలు జమ చేయాలి.

– నరసింహప్ప, కొంకల్లు, గుడిబండ మండలం

వేతనాలు చెల్లించాలి



రోజుల తరబడి ఉపాధి పనులు పనిచేస్తున్నాం. కాని ఇప్పటి వరకూ వేతనాలు అందలేదు. వారం వారం పోస్టాఫీసుకు వెళ్లి చెక్ చేస్తుంటే.. ఇంకా డబ్బులు జమ అవ్వలేదని చెబుతున్నారు. దీంతో రోజురోజుకీ బకాయిలు పెరుగుతున్నాయి. ఇల్లు గడవడం కష్టంగా ఉంది.

– ఈరన్న, టీడీ పల్లి గ్రామం, రొళ్ల మండలం

నిధులు రావాల్సిఉంది



ఉపాధి వేతనాలు సంబంధించి నిధులు విడుదల వ్వాల్సి ఉంది. సుమారు ఏడు నుంచి ఎనిమిది వారాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వచ్చిన వెంటనే జమ చేస్తాం. వారం పది రోజుల్లో నిధులు వస్తాయని భావిస్తున్నాం. వేతనదారులు ఆందోళన చెందవద్దు.

– లక్ష్మీనారాయణ, ఏపీడీ, మడకశిర


శ్రీదేవీ,భూదేవీ సమేత కనుమ లక్ష్మీనారసింహుడు


అశేష జనవాహిని నడుమ సాగుతున్న రథోత్సవం

నమో నారసింహ..

- వైభవంగా కనుమ లక్ష్మీనారసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం

చిలమత్తూరు: మండలంలోని కనుమ లక్ష్మీనారసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కదిరి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం స్వామి వారి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవి సమేత లక్ష్మీనారసింహుడిని పల్లకీలో ఆలయం నుంచి రథం వరకూ ఊరేగింపుగా తీసుకువెళ్లి రథంలో కొలువుదీర్చారు. వేలాదిగా తరలివచ్చిన అశేష భక్తజనం నడుమ నారసింహుడి నామస్మరణలతో చిలమత్తూరు మార్మోగింది. భక్తులు గోవింద.. గోవింద.. అంటూ రథాన్ని దిగువ బస్టాండ్ వరకూ లాగారు. దవనం, మిరియాలు, అరటిపళ్లు రథంపైకి విసిరి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. సమీప గ్రామాలు, కర్ణాటక నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేమనరెడ్డి సంఘం, అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి ధూళోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం


లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం నీలంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. అనంతరం కాలనీలోని లక్ష్మీనరసింహస్వామిని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తితో పాటు ఆలయంలోని లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తిని గ్రామంలో ఊరేగించారు. భక్తులకు అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ


ఆర్.అనంతపురంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మడకశిరరూరల్: మండలంలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా శుక్రవారం ఆర్.అనంతపురంలో ఖాళీ స్థలాలు, ఇళ్ల ముందు, పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటి నీరు పోశారు. కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీదేవి మాట్లాడుతూ మొక్కలు పెంపకం ద్వారానే కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినమ్మ, కళాశాల నీటి విభాగం అధ్యాపకుడు మురళికృష్ణ, పీఓ ముంజుల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి నారాయణ స్వామి జయంతి


యోగి నారాయణ స్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పావగడ: బలిజల ఆరాధ్య దైవం కాలజ్ఞాని యోగి నారాయణ స్వామి(తాతయ్య) తత్వాలు, సిద్ధాంతాలు ఆచరణీయమని తహసీల్దార్ వరదరాజు అన్నారు. స్థానిక తాలూకా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన యోగి నారాయణ స్వామి 299వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి చిత్ర పటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తాలూకా బలిజ సంఘం అధ్యక్షుడు గుర్రప్ప, మున్సిపల్ కౌన్సిలర్లు టెంకాయల రవి, వెంకటరమణ, సత్య లోకేశ్, అనిల్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ పుర్రె లభ్యం


పుర్రెను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని

మడకశిరరూరల్: ఉగ్రేపల్లి సమీపంలోని భూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ పుర్రె లభ్యమైంది. ఇసుకలో పూడ్చిన మహిళ మృతదేహాన్ని కుక్కలు బయటకు లాగడంతో పుర్రె బయట పడింది. గమనించిన పశువుల కాపరులు గ్రామస్తులకు సమాచారం అందించారు. మరోవైపు భూతప్ప కనుమలో గుర్తు తెలియని మహిళ పుర్రె ఫొటో అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో శుక్రవారం ఉదయం ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, రూరల్ సీఐ రాజ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని పుర్రెను పరిశీలించారు. మహిళ మృతదేహాన్ని శనివారం బయటికి తీస్తామని పోలీసులు తెలిపారు.

తప్పిన ప్రమాదం

సోమందేపల్లి: మండలంలోని కావేటి నాగేపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం కదులుతున్న బొలెరోలో మంటలు చెలరేగాయి. హిందూపురం వైపు నుంచి గోరంట్లకు మూడు ఆవులను తీసుకెళ్తున్నారు. మంటలు రావడంతో డ్రైవర్ గమనించి వాహనాన్ని నిలిపివేశాడు. పొగలు కమ్ముకోవడంతో సమీపంలో ఉన్న నాసిన్ కంపెనీ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. పెను ప్రమాదం తప్పింది.

రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పెనుకొండ: పట్టణంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు జిల్లా రచయితల సంఘం, ఖ్రముద్దీన్ అలీ ట్రస్ట్, త్రిపురా రిసార్ట్, ఘనగిరి లత కళాపరిషత్, బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరగనుంది. శుక్రవారం పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో నాయకులు విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సవిత, జిల్లా ఎస్పీ రత్న, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు సింధూరా రెడ్డి, పరిటాల సునీత ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, గోపీనాథ్, న్యాయవాది శివరామకృష్ణ, ఖలీముల్లా, ముత్యాలమ్మ, పోతులయ్య, కిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న దృశ్యం

లేపాక్షి: ఈనెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప తెలిపారు. ఏపీ గురుకుల పాఠశాల, ఎస్‌ఎస్‌ఆర్‌జెడ్పీ ఓరియంటల్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శుక్రవారం ఉదయం పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరీక్షలకు 725 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. తాగునీరు, బెంచ్‌లను ఏర్పాటు చేశారు.

కల్యాణం.. కమనీయం


లక్ష్మీనరసింహ స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

హిందూపురం: మండలంలోని నక్కలపల్లిలో శుక్రవారం భోగ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. మూలవిరాట్ లక్ష్మీనరసింహ స్వామికి శుక్రవారం తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు చేశారు. విశేష పుష్పాలు, అభరణాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో ప్రాకారోత్సవం చేసి, కల్యాణ వేదికలో కొలువుదీర్చారు. వేదమంత్రాలతో వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.



హిందుపురం	37.0
పెనుకొండ	40.0
మడకశిర	37.0

కనుల పండువగా లంకా దహనం


అలంకరణలో కాటి కోటేశ్వరుడి ప్రభ

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి లంకా దహనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈదుల ముష్టూరు నుంచి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ప్రభను ఊరేగించారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. లంకా దహనాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు. అదేవిధంగా క్షేత్రంలోని మహాంకాళీమాత ఆలయంలో గోపూజ నిర్వహించి, హిందు ధర్మప్రచారంపై వివరించారు. సంజీవపురం, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి, ముష్టూరు, వెంకటగారిపల్లి, అనంతసాగరం గ్రామాలకు చెందిన పలువురు భక్తులు ఎద్దుల బండ్లను ప్రత్యేకంగా అలంకరించుకుని క్షేత్రానికి వచ్చారు. కార్యక్రమంలో ముష్టూరు నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, మాజీ ఎంపీపీ గుర్రం వనజ, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, స్థానికులు ఓబిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సాయి సింహారెడ్డి, రాజసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి, దేవేంద్ర రెడ్డి, ఆనందరెడ్డి, గంగాధరరెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, లింగారెడ్డి, నల్లపరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పాటిల్ ఓబిరెడ్డి, శంకరరెడ్డి, చిట్టిబాల మనోహర రెడ్డి, కుమ్మర శ్రీరాములు, సీపీఐ నాయకులు కమతం కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

దుండగలను పట్టుకోండి

అమరాపురం: మండలంలోని బుల్లేపల్లిలో రక్షిత తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేశారని, దుండగులను పట్టుకుని న్యాయం చేయాలని స్థానిక పోలీసు స్టేషన్‌లో బసవనపల్లి పంచాయతీ కార్యదర్శి మనోహర్‌శర్మ, సర్పంచు భాగ్యమ్మ ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పైపులైన్ ధ్వంసం చేయడం వల్ల గ్రామానికి తాగునీరు లేకుండా పోయిందని, ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.

చోళామాంబ దేవికి ముక్కుపుడక


దాతలు అందించిన ముక్కుపుడక

అమరాపురం: మండల కేంద్రమైన కోట వీధిలో వెలసిన చోళామాంబదేవికి ఇదే గ్రామానికి చెందిన శ్రీనివాసగుప్తా కూతురు శ్రీదేవి కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు శ్రీనివాస్‌కు బంగారు ముక్కు పుడక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోలార్ కంపెనీలపై చర్యలు తీసుకోండి


మంత్రి కృష్ణబైరేగౌడకు సమస్యలను విన్నవిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల రైతుల భూములను కాజేస్తున్న ఇగ్రాన్, అయాన్ సోలార్ కంపెనీలపై చర్యలు తీసుకుని, ఆ భూములను బాధిత రైతులకు తిరిగి ఇప్పించాలని స్థానిక హసిరు సేన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప తదితరులు రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడను విన్న వించారు. ఈ సందర్భంగా పూజారప్ప తో పాటు స్థానిక తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు బ్యాడనూరు శివ, జిల్లా కార్యదర్శి రామాంజి, వళ్లూరు చెన్నకేశవరెడ్డి, నాగేంద్రప్ప, రామకృష్ణ తదితరులు మంత్రిని బెంగళూరులోని కార్యాలయంలో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పూజారప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల భూములకు దారి ఇవ్వకుండా సోలార్ కంపెనీ నిర్వాహకులు అడ్డు పడుతున్నారన్నారు. వెంటనే దారి విడిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు ఖాతా పహణి చేయడంలో నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని మండి పడ్డారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణ బైరే గౌడ మాట్లాడుతూ.. త్వరలోనే పావగడకు వచ్చి సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తానని సమాధానం ఇచ్చారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత


పూజితను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: మతిస్థిమితం లేని ఓ మహిళను రక్షించిన పోలీసులు.. ఆమెను భర్తకు అప్పగించారు. వివరాలు.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన మతిస్థిమితం లేని పూజిత అనే మహిళ గురువారం భువనేశ్వర్ రైలు ఎక్కి బెంగళూరు వైపు వచ్చింది. తోటి ప్రయాణికుల ఫోన్ తీసుకుని బంధువులతో మాట్లాడింది. అప్రమత్తమైన పూజిత భర్త సుమన్ రాయ్ బయలుదేరాడు. అయితే పూజిత హిందూపురం స్టేషన్‌లో దిగి పోయినట్లు తోటి ప్రయాణికులు ఆమె భర్తకు ఫోన్‌లో తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని వెస్ట్ బెంగాల్ పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎస్పీ రత్నకు అక్కడి అధికారులు ఫోన్ చేసి సమస్యను తెలిపారు. తక్షణం స్పందించి ఎస్పీ.. డీఎస్పీ మహేష్ నేతృత్వంలో పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. టూటౌన్ సీఐ కరీం, వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఓ మహిళ ఉన్నట్లు గుర్తించారు. విచారించి పూజితగా నిర్ధారించారు. వెంటనే ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి.. ఈ విషయాన్ని ఆమె భర్తకు ఫోన్‌లో తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన భర్త పూజితను తీసుకెళ్లాడు.

పశువులకు టీకాలు తప్పనిసరి


బేవనహళ్లిలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

హిందూపురం: గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పెంచలయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సోంనాథ్‌ల సూచించారు. శుక్రవారం మండలంలోని బేవనహళ్లిలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద దూడలు, పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి, బ్రుసెల్లా వ్యాధి నివారణకు టీకాలు వేశారు. అధిక జ్వరాలు, పాలు తాగే దూడల మరణాలు, పశువులు నీరసించిపోవడం, ఎద్దుల్లో వృషణాల వాపు, రక్తహీనత, గర్భకోశ సమస్యలు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. రైతులు ముందు జాగ్రత్తగా వెంటనే టీకాలు వేయించాలన్నారు. అనంతరం 180 పాడి పశువులు, 10 దూడలకు బ్రుసెల్లా టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారాయుడు, ఎల్‌ఎస్‌ఏ గౌతమ్ జోష్న, సహాయకులు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం, పఠాన్ ఇమ్రాన్ ఖాన్, అఖిల, మంజుల, అఖిలా బాను సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు


గుర్రపుకొండ తండాలో నృత్యం చేస్తున్న స్థానికులు

మడకశిర/మడకశిర రూరల్/హిందూపురం/అమరాపురం: మడకశిర పట్టణం, హిందూపురంలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకురు. ప్రధానంగా వ్యాపార నిమిత్తం మడకశిరలో స్థిరపడిన రాజస్థానీయులు, వారి కుటుంబసభ్యులు వేడుకలను ఆనందోత్సవాల మధ్య చేసుకున్నారు స్థానికులు సైతం రాజస్థానీయులతో కలిసి రంగులు చల్లుకున్నారు. అలాగే పట్టణంలో నివాసం ఉన్న పలువురు గిరిజనులు పండుగను ఆనందోత్సాల మధ్య జరుపుకోవడం విశేషం. ఇదిలా ఉండగా పట్టణంలో కదిరి పున్నమి సందర్భంగా వివిధ కాలనీల్లో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మడకశిర మండలంలోని అచ్చంపల్లి తండా, వైజీపీ తండా, గుర్రపుకొండ తండా, కేఏస్ తండా,జీఏస్ తండా తదితర తండాల్లో, అమరాపురంలో మండలంలో హోలీ పండుగ చేసుకున్నారు.


అమరాపురంలో రంగులు చల్లుకుంటున్న యువకులు


మడకశిరలో బాలికల సంబరాలు

మహేశ్వరి శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు



పెనుకొండ రూరల్: మండలంలోని చంద్రగిరిలో వెలసిన శ్రీగిరి మహేశ్వరి శక్తి పీఠంలో, మహాలక్ష్మి జయంతి,కామ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం గౌరువనహళ్లి క్షేత్రం నుంచి, మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొచ్చి 1108 కలవ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సహస్రనామావళి, కుంకుమార్చన, మహామంగళ హారతి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.